# రిపార్టీ

## శ్రీ రావుజీ

నిరుడు ఈ రోజుల్లో నేను రెండు మాసాల పాటు బందరు ఆంధ్రజాతీయ కళాశాలలో మకాం వెయ్యడం తటస్థించింది.

అప్పుడొకనాడు పనిమీద అదేదో వూరు వెడితే అక్కడొక బాల్యమిత్రుడు కనిపించి, చాలా తెలివిగా మాటాడుతున్నానని అనుకుంటూ

"అరే అబ్బీ! కళాశాల గాడిదలు ఎలా వున్నాయిరా?" అని అడిగాడు.

అందుకు నేను చిరునవ్వుతో "నీకింత బంధుప్రేమ వున్నదని ఇంతకుముందు తెలియదు సుమా!" అని జవాబిచ్చాను.

పక్కనున్న వాళ్లందరూ పక్కున నవ్వేశారు.

మావాడు మాత్రం...అనవసరంగా ముఖం చిన్నబుచ్చుకున్నాడు.

వాడి కొంటెప్రశ్నకు దెబ్బకొట్టినట్టుగా నేనిచ్చిన కొంటె జవాబును ఇంగ్లీషులో అయితే 'రిపార్టీ' అంటారు.

---

దీన్ని తెలుగులో ఏమనాలో...ఎంత ఆలోచించినా...నాకు పాలుపోలేదు.

'కుక్కకాటుకు చెప్పుదెబ్బ' అంటే 'రిపార్టీ' అర్థం కొంతమట్టుకు స్ఫురిస్తుంది.

అయితే 'కుక్కకాటుకు చెప్పుదెబ్బ' అన్నదానికి 'రిపార్టీ' కంటె ఏమాత్రమో విస్తృతమైన అర్థంవున్నట్టు కనిపిస్తుంది.

ఎవడైనా తప్పుడు పనిచేస్తే, దానికి తగిన పరాభవాన్ని తిరిగిచెయ్యడం కూడా 'కుక్కకాటుకు చెప్పుదెబ్బ' అన్నదానిలోకి వస్తుంది.

'రిపార్టీ'కి ఈ అర్థం వర్తించదు. అల్లరి మాటలకు ఛలోక్తిగా జవాబుచెప్పి నోరు మూయించడం మాత్రమే 'రిపార్టీ' అంటారు.

పూర్వపుణ్యంవల్లనే గాని కవిత్వం అబ్బదని ఒక నమ్మకం వుంది. 'రిపార్టీ' కూడా అంతేనేమో!

---

ఎదటివాడు అల్లరిగానో ఎత్తిపొడుస్తూనో ఏడ్పించాలనో ఏదో మాట అనేసరికి తెల్లబోకుండానూ, తడుముకోకుండానూ ... గొడ్డలి పెట్టు పెట్టినట్టు...ఠపీమని జవాబు పడవేసి, వాడినోరు మూయించ గలగడం మరి సామాన్యమా?

ఈ శక్తివున్న వాడు...పిడుగులా...ఎక్కడ పెట్టినా జయించుకు రాగలడు.

---

ఉదాహరణంగా, లాయడ్ జార్జిని చూడండి:—

పేదవాని కడుపున పుట్టాడు; చదువు సంధ్యలకు తగిన అవకాశాలు ఏమీ చిక్కలేదు; అయినా అఖండమైన బ్రిటిష్ సామ్రాజ్యానికి ప్రధాని అయ్యాడు; ఒక పట్టులో ప్రపంచం భవిష్యత్తు అంతాకూడా తనచేతిలో పెట్టుకోగలిగాడు!

దీనికి కారణం ఏమంటారు?

నన్నడిగితే, ఆయనకున్న 'రిపార్టీ' శక్తి! అని అంటాను.

అంటే కేవలం 'రిపార్టీస్' ఎడాపెడా విసరడం వల్లనే ఆయన అంత వున్నతికి వచ్చాడని కాదు—

'రిపార్టీ' ఇవ్వగలిగాడంటే, వాడికి సున్నితమైన మేధాశక్తి వున్నదన్న మాట! ఆశక్తి వున్నవాడు కాలానికే ఎదురీద గలుగుతాడు!

లాయడ్ జార్జి విసిరే 'రిపార్టీ'లు మహా మజాగా వుంటాయి.

రుచికి రెండుమూడింటిని ఇక్కడ వుదాహరిస్తాను?

ఒక రోజున అదేదో ఎలక్షన్ మీటింగులో ఆయన వుపన్యసిస్తున్నాడు.

అప్పుడు సభికులలో నుంచి ఒక అమ్మి తుపానులాగా లేచి

'నేనే నీ పెళ్లాన్ని అయితే, తప్పకుండా విషం యిచ్చేదాన్ని!' అని అన్నది.

అందుకు ఆయన కొంటెగా చిరునవ్వుతో!

'నేనే నీభర్తనయితే దాన్ని తప్పకుండా పుచ్చుకునేవాణ్ణి!' అన్నాడు.

---

ఇంకోసారి ఎలక్షన్ మీటింగులోనే ఒక కొంటె కోణంగి.

'అయితే, మీనాయన గాడిదగంతను తోలేవాడు కాదూ?' అని అడిగాడు.

దానికి 'గంతమాట ఏమో తెలియదు గాని గాడిదమాత్రం నా యెదుట ప్రత్యక్షంగా వుంది' అని ఆయన జవాబు!

ఇంకో సందర్భంలో లాయడ్ జార్జి 'హోంరూలు'ను గురించి వుపన్యసిస్తున్నాడు.

ఉపన్యసిస్తూ, 'ఐర్లెండుకు హోంరూల్ కావాలి; స్కాట్లెండుకు హోంరూల్ కావాలి; వేల్సుకు హోంరూల్ కావాలి; బ్రిటన్‌కు...'

సభలోవున్న తాగుబోతు వెధవ యెవడో మాటలకు అడ్డువచ్చి, 'నరకానికో?' అన్నాడు.

'వోఁ! నరకానికి కూడా హోంరూల్ కావలసిందే! స్వదేశం అంటే అభిమానాన్ని చూపించిన ఆ పెద్దమనిషి ఎవరో గాని ఆయనకు నా ధన్యవాదాలు!

సభలో హర్షధ్వానాలు మిన్నుముట్టి పోయాయి!

ఇలాగే ఇంకా యెన్నో కథలు వున్నాయి.

ఈనాటి రాజకీయనేతలెవరూ కూడా లాయడ్ జార్జిని రిపార్టీలో మించలేరనే చెప్పాలి.

తాను వుపన్యసిస్తూ వుంటే, కొంటె ప్రశ్నలు పడాలని ఆయన అసలుకోరుకుంటాడు కూడా!

అలా ప్రశ్నలు పడకపోతే, ఆయన బుద్ధి ప్రకోపించనూ ప్రకోపించదు; వుపన్యాసం రాణించనూ రాణించదు.

---

పార్లమెంటులో ఏదైనా గొప్పవిషయం చర్చకు వచ్చినప్పుడు ప్రభుత్వాన్ని ప్రతి ఘటించడానికి లాయడ్ జార్జి లేచాడనుకోండి.

అప్పుడు ఆయన్ని అడ్డదిడ్డంగా ప్రశ్నలు వేశారో మాడు పగిలిందన్న మాటే!

అలా కాకుండా ఏదో ముంచుకు పోయినట్టు ముఖాలు పెట్టి, చడీ చప్పుడు లేకుండా కూర్చుంటే, వుపన్యాసం సక్రమమైన ధోరణిలోనైనా పడకుండా తగలబడి పోతుంది.

---

లాయడ్‌జార్జి ఈ ప్రకృతికి చర్చిల్ ప్రకృతి పూర్తిగా భిన్నం.

తన వుపన్యాసాన్ని ముందుగా రాసుకుని, దాన్ని అంతాత్ముణ్ణంగా బట్టీ పెట్టి, ఆ తర్వాత పార్లమెంటుకు వస్తాడు చర్చిల్!

అందరూ 'సీరియస్'గా వింటూ వున్నారా, తుక్కు రేగేటట్టు అంతా అప్పజెప్పి వేస్తాడు. ప్రతి పక్షులవాదం ఎంత బలంగా వున్నా దాన్ని చీల్చి చెండాడుతాడు.

అలా కాకుండా నాలుగు అడ్డదిడ్డం ప్రశ్నలు వెయ్యండి; వుపన్యాసం ధోరణి తెగిపోతుంది; తబ్బిబ్బు పడతాడు; మాటల కోసం తవుళ్ళాడుతుంటాడు; చివరకు తనవాదం మాటే మరిచి పోయి, బూతులు తిడతాడు!

పాపం! ఇది అతనికి పెద్దలోపం,

---

పార్లమెంటులో ఇలా గొడవపడ్డా, ప్రయివేటు జీవితంలో అయితే చర్చిల్ అయినా కొంతవరకు 'రిపార్టీ' శక్తివున్న వాడేసుమండీ!

ఇప్పుడు లేదు గాని, పూర్వం చర్చిల్ మీసాలు పెంచుతూ వుండేవాడు.

ఆ రోజుల్లో ఒకనాడు ఒక ఆవిడ 'మిమ్మల్ని చూస్తే నాకు రెండు విషయాలు వచ్చవు' అన్నదట!

"'ఏమిటవి?' అని అడిగాడు చర్చిల్!

'మీ రాజకీయాలూ, మీ మీసాలూ!'

'కావచ్చును గాని, ఈ రెండింటిలో దేని స్పర్శకూడా మీకు తగలుదుగా!'

ఈ విదిలింపుతో నిలువునా నీరయి పోయింది ఆ ఇల్లాలు!

---

పార్లమెంటులో రాణించడానికి రిపార్టీ ఎంత అవసరమో, న్యాయస్థానాలలో కూడా అంత అవసరమే!

సాక్షిగాని యెదటి వకీలుగాని జడ్జీగాని ఏమాత్రం అవకతవకగా మాటాడినా రవీమని నోటిమీద కొట్టగలిగితే వచ్చే ప్రతిష్ఠ సామాన్యమా? మన దేశంలో యేమిటి, విదేశాలలో యేమిటి - ఎక్కడైనా ప్రసిద్ధి

కొక్కన న్యాయవాదుల్ని చూస్తే వారిలో ఈ 'రిపార్టీ' శక్తి ఇంతో అంతో కనబడుతుంది.

మన న్యాయస్థానాలలో జరుగుతున్నది న్యాయవిచారణా? ఎబ్బే లేదు! వకీళ్ల తెలివి తేటల విచారణ?

ఏపక్షం తెలివిగల లాయరును పెట్టుకుంటే, ఆపక్షం వైపున డిక్రీ!

అందుచేత అసలు 'రిపార్టీ' శక్తి లేనిదే గొప్ప లాయర్ కావడానికి వీలే లేదు.

---

లాయర్ల రిపార్టీస్‌ను గురించి ప్రచారంలో వున్న కథలలో కొన్ని ఇవి:—

ఆస్‌వాల్డు అనే ఇంగ్లీషులాయర్ ఏదో అప్పీలులో ఎషర్ ప్రభువు యెదట వాదిస్తున్నాడు.

అప్పుడు ఎషర్ ప్రభువు వాదన కడ్డువచ్చి 'మిష్టర్ ఆస్‌వాల్డు! జడ్జీలకయినా కొంత 'కామన్ సెన్సు' వుంటుందని వొప్పుకోవాలి సుమా!'

'చిత్తం! అలాగ అనుకునే కిందకోర్టులో పొరపడ్డాను'

ఈ దెబ్బకు జడ్జీ గిజగిజ తన్నుకున్నాడంటే ఆశ్చర్య మేముంది?

---

టిం హే యి లీ అని ఒక ఐరిష్‌లాయర్ వుండేవాడు.

ఈయన ప్రసిద్ధనామం, టైగర్‌టిం!

ఒకనాడు టైగర్‌టిం ఏదో 'సబార్డినేట్ కోర్టు'లో వాదిస్తున్నాడు. ఆకోర్టు జడ్జీకి ఒక పెంపుడు కుక్కవుండేది.

దాన్ని కోర్టుకు తోడుకువచ్చి, తన పీఠానికి పక్కన వేదికపైన కూర్చోబెట్టుకునే వాడు.

టిం ఆనాడు వాదిస్తూ వుండగా, జడ్జీ సగంలో కుక్కవైపుకు తిరిగి దాన్ని నిమరడం ప్రారంభించాడు.

వెంటనే తనవాదాన్ని ఆపివేశాడు, టిం!

'ఆగిపోయావు దేనికి, సాగనీ!' అన్నాడు జడ్జీ తలైనా యెత్తకుండా!

"మరేమీ లేదుస్వామి! సలహాచేస్తున్నారేమోనని ఆగిపోయాను!"

పేగులుతెగే ఈదెబ్బకొట్టినా, టైగర్‌టిం ముఖం మాత్రం బహు అమాయకంగా వుంది!

ఇలాగే వేరే ఏదో కోర్టులో టిం వాదన చేస్తూవుండగా, జడ్జీ రెండుకాళ్ళనూ బల్లమీద పెట్టాడట!

ఈసారికూడా టిం తనవాదన్ని వెంటనే ఆపుచేశాడు.

"కానియ్యి! ఆగినావే!" అన్నాడు జడ్జీ!

"చిత్తం! వాదన్ని తలకు చెప్పాలో, మొలకు చెప్పాలో తెలియక, ఆగిపోయాను" అన్నాడు టిం!

"దేనికైనా సరే!"

"చిత్తం! తలలో యెంత 'లా' వున్నదో, మొలలోకూడా అంతేగా!"

తపీమని కాళ్లుదించి, సరిగా కూర్చున్నాడు జడ్జీ !

---

మరోకథ:—

ఈ కథలో ఆ లాయరు ఎవరో తెలియదు గాని, జడ్జీమాత్రం హాకిన్సు అనే ఆయన!

ఈయనగొంతు చాలా కరుణార్ద్రింగా వుండేదట! ఎటువంటి నేరస్థుడయినా సరే, ఆయన గొంతువింటే చాలు,—తనకు శిక్షభయం లేదని ఆశపడుతూ వుండేవాడట!

ఒకరోజున ఆయన కోర్టులో ఒకనేరస్థుడు "ఇదివర కెప్పుడూ నేను ఖైదుకు వెళ్ళలేదు, బాబూ!" అంటూ వలవల యేడ్చాడట!

"ఎబ్బె! ఇంతమాత్రానికి ఏడ్వడం దేనికి? ఆ కొరతను నేను తీరుస్తానుగా?" అంటూ హాకిన్సు అతన్ని భలో క్తిగా బుజ్జగించాడట!

తర్వాత నాలుగేళ్ళు వడ్డించి వాడికొరతను తీర్చాడట కూడా!

ఈ జడ్జీ హాకిన్సు ఒకప్పుడొక లాయరు చేతిలో మంచిదెబ్బ తిన్నాడు.

తాగి, తందనాలాడి, గలభాచెయ్యడం ఆనాడు విచారణ జరుగుతున్న కేసు.

నేరస్థులలో బీరుకు డబ్బించ్చింది యెవరు? ఆడదా? మగవాడా? అని ప్రశ్న వచ్చింది.

"సాక్ష్యాన్నిబట్టి చూస్తే, ఆడదే ఇచ్చినట్టు కనబడుతుంది" అని లాయరు అన్నాడు.

"అబ్బే! అలా జరిగివుండదు! బీరుకు మగవాడే సర్వదా డబ్బిస్తూ వుంటాడు" అని జడ్జీ అన్నాడు.

"దేవరవారు ఎంతో స్వానుభవం వున్నవారు! తమరు అలా సెలవిస్తే నేను కాదనగలనా?" అని చల్లగా చతికిలబడ్డాడు లాయరు!

---

ఇక, మనదేశానికి వద్దాం—

అలహాబాదు కోర్టులో పండిత మోతీలాల్ నెహ్రూ ఏదో కేసులో సాక్షినివిచారిస్తూ వుండగా, అతను—

నేనే వెధవననుకున్నారా?" అన్నాడట.

అందుకు పండితుడు—

"రామరామ! అలా అనుకుంటానా? కాని! నేను పొరపడవచ్చును, చూడు!" అన్నాడట,

---

కీర్తిశేషుడైన మద్రాసు లాయరు భాష్యం అయ్యంగారు హైకోర్టులో విసిరిన రిపార్టీస్ చాలా వున్నాయి.

అయితే, వీటినీ తర్జుమా చెయ్యడానికి వీలు కనబడడంలేదు.

ఇంతకుముందు వుదాహరించిన రిపార్టీస్‌లో అయినా ఇంగ్లీషులోవున్న ఆ మజా తెలుగులోకి వచ్చిందో లేదో.

అయినా, భాష్యం అయ్యంగారిని గురించిన చిన కథల్ని ఒకటి రెండింటిని తర్జుమా చెయ్యడానికి ప్రయత్నంచేస్తాను.

ఒకనాడు ఆయన కోర్టులో వాదిస్తూవుండగా జడ్జీ "ఎబ్బె! ఇక వాదించి లాభంలేదు, మీ

మాటలు ఈ చెవినిపడితే, ఆ చెవిగుండా బయటికి వెళ్లిపోతాయి !" అన్నాడట !

"యస్! మైలార్డ్! ఆ రెండు చెవులమధ్యనూ ఏమైనా వుంటేకదూ!" అని భాష్యంగారు చమత్కరించారట !!

హైకోర్టుజడ్జీలలో చాలామందితో భాష్యంగారికి స్నేహంవుండేదట !

ఈ జడ్జీలలో ఒకాయన యింటికి ఆయన ఖులాసాగా ఒక సాయంత్రం వెళ్లాడట!

అప్పుడు జడ్జీగారి కుక్క 'భౌ! భౌ! అని మొరుగుతూ, పైకి వచ్చిందట.

కొంచెం జంకి, భాష్యంగారు ఒక అడుగు వెనక్కి వేసేసరికి—

"మొరిగేకుక్క కరవదనే సామెతవున్నది, మీకు తెలియదూ?" అని జడ్జీ నవ్వాడట !

"నాకైతే తెలుసుననుకోండి, కాని ఈకుక్క ఆ సామెత వినలేదేమోనని సంకోచం !"

ఈమాటకు జడ్జీ విరగబడి నవ్వాడట !

---

న్యాయస్థానాలలో మాదిరిగానె పాఠశాలల్లోకూడా రిపార్టీస్‌కు చాలా అవకాశం వుంది.

కుర్రాళ్లు మాష్టర్లమీదా, మాష్టర్లు కుర్రాళ్లమీదా విసిరే దెబ్బలనుగురించి ఎన్నోకథల్ని మనం వింటూ వుంటాము.

వాటిలో మొదటిరకానికి ఒకటీ, రెండోదానికి ఒకటీ వుదాహరణంగా ఇక్కడ రెండు కథల్ని మాత్రం చెబుతాను:—

ఒక ఇంగ్లీషు బడిపంతులు పాఠం అప్పజెప్పని కుర్రవాణ్ణి నిలవేసి బెత్తంతో—

"ఈ బెత్తం చివర ఒకఫూల్ వున్నాడు" అని తెలివి వొలకబోసుకుంటూ తలతిరుగుడుగా అన్నాడు.

దానిపైన ఆకుర్రవాడు తీసినదెబ్బ ఏమిటంటే—

"ఏ చివరండీ?" అని

పోతే రెండోకథ:—

సర్: డాక్టర్, ఆర్: వెంకటరత్నంనాయుడుగారు ఒకప్పుడు బందరు నోబుల్ కాలేజీలో లెక్చరర్‌గా పనిచేస్తూవుండేవారు.

అప్పుడు వారు హైస్కూలు క్లాసులకు కూడా పాఠాలు చెప్పవలసి వుండేది.

ఆ రోజుల్లో ఒకనాడు వారు కుర్రవాళ్ల కాంపోజిషన్ పుస్తకాలను...తిరిగి ఇచ్చివెయ్యడానికిగాను...క్లాసుకు తీసుకు వెడుతున్నారు.

అది నలభైమంది కుర్రాళ్లు వున్నక్లాసు. నలభై పుస్తకాలూ వారిచేతిలో పెద్ద బరువుగా వున్నాయి.

దీన్నిచూచి ఆక్లాసు కుర్రవాడొకడు అల్లరిగా నవ్వుతూ—

"మాష్టరుగారూ ! ఒకగాడిద బరువుపైన పడిందే !" అన్నాడు.

ఇందుకు నాయుడుగారుకూడా నవ్వుతూ—

"ఎబ్బే ! ఒక్కగాడిద బరువుకాదురా ! నలభైగాడిదల బరువు !" అని జవాబిచ్చారు !

---

కేవలం క్లాస్‌రూంకు సంబంధించినది కాక పోయినా, ఇటువంటిదే శ్రీ చెరుకువాడ నరసింహం పంతులుగారి రిపార్టీకూడా వుంది.

"ఆంధ్రవాచాల", "ఆంధ్రభీమాడిండిమ" కాక పూర్వం పంతులుగారు చాలాకాలం పాటు కవుతరంలో మాష్టరుపని చేశారు.

అప్పటిలో తమవద్ద చదువుకున్న ఒకశిష్యుని ఇంటికి పంతులుగారు ఒక సందర్భంలో వెళ్ల వలసి వచ్చింది.

ఈ శిష్యుడు చాలా దుడుసువాడు. బడిలోనే మాష్టరుగారికి చాలాసార్లు ఎదురుతిరిగాడు; ఆతర్వాతకూడా అప్పుడప్పుడు లోకవ్యవహారాలలోకూడా ప్రతిఘటించాడు.

పంతులుగారి స్నానం పూర్తిఅయ్యేసరికి, శిష్యుడు లాంఛనంగా బొట్టుపెట్టె దగ్గర పెట్టాడు.

బొట్టు పెట్టుకోవడం అసలు పంతులుగారికి అలవాటున్నట్టులేదు. అయినా, నామమూ, తిరుచూర్ణమూ ఎదట కనబడేసరికి పంగనామాలు పెట్టుకుందామని సరదాపోయింది.

కాసేపు రెప్పవెయ్యకుండా చూచి, ఆశ్చర్య పడుతూ శిష్యుడిలా అన్నాడు:—

"అలవాటు లేకపోయినా, మాష్టరుగారు తీరుగా పంగనామాలు పెట్టుకున్నారే!"

ఇందుకు పంతులుగారి రిపార్టీ ఇది:—

"అలవాటు కావాలటరా? శిష్యులు పెట్టిన వాటి అనవాళ్ళు లేవూ?"

---

పార్లమెంటు, కోర్టు, బడి—ఈ మూడింటికి సంబంధించిన కథల్ని ఇంతవరకు చెప్పినట్టున్నాను. ఇక, దర్బారుకు సంబంధించిన వాటిని కూడా కొన్నింటిని వుదాహరిస్తాను:—

ఈ బాపతులో చాలా పురాతనమైనది రోమన్ చక్రవర్తి అగష్టస్‌కు సంబంధించినకథ!

చక్రవర్తికి ఒకనాడు సరిగ్గా తననే పోలిన వ్యక్తి కనిపించాడట!

కనిపించడంతోనే అతి అహంకారంగా అగష్టస్ అతన్ని "మీఅమ్మ యెన్నడైనా రోం నగరంలో కాపురం వున్నదా?" అని అడిగాడట!

ఈ ప్రశ్నలోవున్న ధ్వని ఏమిటంటే— "మీ అమ్మ మా నాయనతో రంకుపోయి, నిన్నుకనలేదుగదా!" అని.

ఇందుకు ఆ ఆసామి అతిధైర్యంగా—

"మా అమ్మ రోం నగరం ఎన్నడూ తొంగైనా చూడలేదుగాని, మా నాయనమాత్రం అక్కడ చాలాకాలం వున్నాడు!" అని జవాబిచ్చాడట!

ఇంత రణపెంకిగా జవాబిచ్చిన ఆ ఆసామి బ్రతుకు తర్వాత యేమైనదో!

ఎంచేతనంటే రాజులు తలుచుకుంటే దెబ్బలకు కొదవా?

---

మరోచక్రవర్తి కథ:—

నెపోలియన్ ఒకనాడు తన ప్రయివేట్ సెక్రటరీని చూచి—

"నీవు చాలా అదృష్టవంతుడవు సుమా! నాకు సెక్రటరీగా పనిచేసిన కారణాన నీపేరు చరిత్రలో చిరస్థాయిగా వుండిపోతుంది?" అన్నాడట!

అందుకు బదులుగా ఆ సెక్రటరీ ఈ ప్రశ్న అడిగాడట:—

'అయితే, ప్రభూ! అలెగ్జాండరు చక్రవర్తి ప్రయివేట్ సెక్రటరీ పేరేమిటో కొంచెం మనవి చేస్తారా?"

మరి పలుకేలేదు!

---

పూర్వకాలపు ఇంగ్లీషుయువరాజుల్లో ఒకాయన ప్రిన్సు రీజెన్టు – ఒకనాడు పోర్ట్సుమత్ వెళ్లి అక్కడ జాక్ టవర్సు అనేవాడు కనబడే సరికి:—

'హాలోఁ! టవర్సు! పోర్ట్సుమత్ లో నిన్ను మించిన బటాచోర్ లేడంటారు నిజమేనా?' అని అడిగాడట!

అందుకు టవర్సు అతి నమ్రంగా వంగి 'దేవర వారు నాఖ్యాతిని అపహరించడానికి ఇక్కడకు రాలేదుగదా! అని వూడవేశాడట!

---

విల్క్సు అనే మరొకడు 'గాడ్ సేవ్ ది కింగ్' అని పాడుతూ వుంటే, ఈయువరాజే:—

'అయితే, ఎంత కాలంగా ఈ పాటను పాడుతున్నావోయ్!' అని ప్రశ్నించాడట!

ఈ ప్రశ్నకు జవాబుగా విల్క్సు ఇలా అన్నాడట:—

'ప్రభువులవారి పరిచయ భాగ్యం లభ్బిన నాటి నుంచీ!'

---

మనదేశంలో ప్రతి రాజసభలోనూ ఒక విదూషకుడు వుండడం ఆచారం వుండేది. గనక బహుశావాళ్లు రాజులమీదనూ, రాజులు వాళ్ల మీదనూ విసిరిన దెబ్బలు చాలావుండి వుండాలి.

పైగా ఈ విదూషకులకు సభలో తగిన స్వతంత్రమూ, కొంత మర్యాదా వుండేవికూడా! అంచేత మజాగా అనగలిగితే ఎంత మాటైనా అనడానికి వాళ్లకు అవకాశం వుండేది.

అయితే, మన రాజసభలకు సంబంధించి నంత వరకు రిపార్టీస్ కథలు ఎంచేతనో గాని విశేషంగా ప్రచారంలో లేవు.

ఇటువంటి విదూషకులలో ఎన్నవలసిన వాళ్లు అగ్బర్ చక్రవర్తి దర్బార్‌లోని బీర్‌బల్, శ్రీకృష్ణదేవరాయలు సభలోని తెనాలిరామలింగడు.

బిర్‌బల్ రిపార్టీస్‌ను గురించి ఉత్తర హిందూస్థానంలో చాలా కథలు ప్రచారంలో వున్నాయి.

వాటిల్లో ఒకటిది:—

అక్బరు చక్రవర్తీ బీర్‌బల్ – ఇద్దరూ ఒక నాడు మామిడిపళ్లు ఫలహారం చేస్తున్నారు.

అప్పుడు అగ్బరు తానుతిన్న మామిడిపళ్లు టెంకలన్నీ బీరబల్ ఎదటకు నెట్టుతూ వచ్చి, ఫలహారం అంతా అయిన తర్వాత మొత్తం అన్ని టెంకల్నీ లెక్క చెబుతూ:—

'అబ్బ ఎన్నిపళ్లను తినివేశావ్ ! బీర్‌బల్!' అన్నాడట.

"నిజమే! చాలాతిన్నాను సుమండీ!" అని నటనచేస్తూ బీరుబల్ ఇలా అన్నాడట:—

'కాని, జహాపనాహ్! నేను టెంకల్ని అయినా వదిలివేశాను. తాము వాటిని కూడా చిత్తగించారు!'

సరసపు గనక, పకపక నవ్వి వుండాలి అగ్బరు!

---

చెబితే 'రిపార్టీస్'ను గురించి ఇలాగే అంతు లేకుండా కథలున్నాయి.

కాని యిప్పటికే చాలా కథలైనాయి గనక మరి విరమిస్తాను.

అయితే విరమించే ముందు మరొక్క కథనుమాత్రం చెబుతాను.

ఎదటివాణ్ణి దెబ్బకొట్టడం కథతో దీన్ని ప్రారంభించాను కదూ? అంచేత నేను దెబ్బ పడటం కథతో దీన్ని ముగిస్తాను.

అప్పుడు అటుజమ ఇటుఖర్చు మొత్తం చిత్తా సరిపోతుంది.

ఒకనాడు మేము పదిమంది స్నేహితులం కలిసి చిన్న 'పిక్‌నిక్' చేసుకున్నాము.

అప్పుడు మా బృందంలో ఒకరిద్దరు అమ్మాయిలు కూడా వున్నారు.

సంభాషణలు, సరసాలు విపరీతంగా సాగుతున్నాయి.

ఇంతలో పాయసం వడ్డనకు వచ్చింది.

ఒక అమ్మాయి 'అయితే చంచా లేదటండీ?' అని అడిగింది.

'పాయసం తినడంలో నాజూకు పోవాలి కామోసు!' అన్నాను నేను.

ఇందుకు ఆ అమ్మాయి విసరిన విసరు ఏమిటంటే 'ఎబ్బే! ఈ మాత్రానికే చేయిచేసుకోనా?" అని చూస్తున్నానని!

తక్కిన వాళ్లతో పాటు నేనూ నవ్వానుగాని, నానవ్వు తెచ్చిపెట్టుకున్నట్టు కనబడి పోయింది!

---


## పంచవటి

(అయిదు కథలు)

శ్రీ శ్రీనివాస శిరోమణి విరచితము

వెల 6 అణాలు

"ఇటువంటి ఆకర్షణీయమయిన పుస్తకము తెనుగునందిదివరకు వెడలలేదేమో" గోలకొండ పత్రిక

## ది ఓరియంటల్ బుక్ డిపో

మద్రాస్